క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖవాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 – 2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

'జగనన్నకు చెబుదాం'కు మూడు అర్జీలు



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

జగదాంబ: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ సన్యాసినాయుడు ఆదేశించారు. సూర్యాబాగ్‌లోని జోన్-4 కార్యాలయంలో సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జోన్ పరిధిలో యూసీడీ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి మూడు అర్జీలు ప్రజలు అందజేశారు. జెడ్సీ సంబంధిత అధికారులతో కలిసి వినతులు పరిశీలించి, రిపోర్టు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ స్థాయి అధికారులు, ఏపీడీ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

11న దళిత సింహగర్జన

డాబాగార్డెన్స్: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన 25 పథకాలు పునరుద్ధరించాలని, రాష్ట్రంలోని దళితులను చైతన్యవంతుల్ని చేయడానికి ఈ నెల 11న రాజమహేంద్రవరంలో దళిత సింహగర్జన నిర్వహించనున్నట్టు మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దళితులకు సంబంధించి 25 పథకాలను ప్రభుత్వం తీసేసిందని ఆరోపించారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి రుణం ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపించారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని, కాంగ్రెస్ పార్టీ నుంచే పోటీ చేస్తానని తెలిపారు. సమావేశంలో దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య పెంపుపై విద్యార్థులు దృష్టి పెట్టాలి



సదస్సులో ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యం పెంపు దృష్టి పెట్టాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ, టీ కాబ్స్–ఈ సంయుక్త నిర్వహణలో మూడు రోజుల రాష్ట్ర స్థాయి జీవ సదస్సు(ది ఆంధ్రా బయో సమ్మిట్)ను ఆయన సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 400 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులను విశ్వవనరులుగా తీర్చిదిద్దడంలో ఏయూ ముందంజలో ఉందన్నారు. విద్యార్థులు తమ నైపుణ్య ప్రత్యేకతను చాటాలన్నారు. ప్రయోగాత్మక, ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య వి.లక్ష్మీ, చైర్ ప్రొఫెసర్ పి.ఎస్.పి.ధనుంజయ్, ఆచార్య పద్దయ్య, టి.క్యాబ్స్–ఈ వ్యవస్థాపకుడు డాక్టర్ రవి, ఆచార్య సుజాత తదితరులు పాల్గొన్నారు.



అన్ని సౌకర్యాలు చెంతకే..

- సీఎం వైఎస్ జగన్ పాలనపై లబ్ధిదారుల ప్రశంసలు
- ఇంటికే పథకాలు రావడంపై హర్షం



పింఛన్ నగదు అందుకున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం



29వ వార్డులో లబ్ధిదారుల వద్దకు వెళ్లి రూ.3 వేల పింఛన్ అందిస్తున్న వలంటీర్ సునీత

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి తమ లోగిళ్లు ఆనందంతో వెల్లివిరుస్తున్నాయని నియోజకవర్గంలోని లబ్ధిదారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లకు, రేషన్ సరుకులకు నానా పాట్లు పడేవారమన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక ఇంటికొచ్చి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని కొనియాడారు. తమ బాగోగులు చూసేందుకు వలంటీర్లను ఏర్పాటు చేయడంతో ఎంతో మేలు జరుగుతోందన్నారు.

సమపాళ్లల్లో అభివృద్ధి, సంక్షేమం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తూ పేద, మధ్య తరగతి ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. ముఖ్యంగా ప్రజల లోగిళ్లలోకి వెళ్లి రేషన్ సరకులు అందజేస్తున్నారు. నాటి ప్రభుత్వ హయాంలో పింఛన్‌కైనా.. రేషన్‌కైనా పేదలు నానా ఇబ్బందులు పడేవారు. జన్మభూమి కమిటీ చెప్పిన వారికే పథకాలు అందేవి. మిగిలిన వారికి చుక్కలు చూపించేవారు. అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు కూడా పెన్షన్లు సవ్యంగా అందేవి కాదు. ఏ సాయంత్రానికో.. రాత్రికో పింఛన్ ఇచ్చేవారు. రేషన్ కావాలంటే తెల్లవారే లైన్‌లో నిల్చోవాలి. టీ, టిఫిన్, చద్దన్నం తినడానికి కూడా లేకుండా క్యూలో నిల్చుంటేనే రేషన్ అందేది. లేదంటే అంతే సంగతులు. రేషన్ కావాలన్నా.. రేషన్ కావాలన్నా ఆ రోజు కూలి పని మానుకోవాల్సి వచ్చేది.

అవ్వాతాతల మోముల్లో ఆనందం

జగనన్న ప్రభుత్వంలో అవ్వాతాతలు ఎవరిపై ఆధారపడకుండా వారికి ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ వస్తోంది. వలంటీర్ ఇంటికొచ్చి తలుపు తట్టి రూ.3 వేలు అందిస్తున్నారు. దీంతో అవ్వాతాతల మోముల్లో ఆనందం వెల్లివిరిస్తోంది. రేషన్ సరుకులు కూడా ఇంటి వద్దకే వస్తున్నాయి. నిమిషాల్లో సరకులు అందించి వెళ్లిపోతున్నారు. పథకాల సమాచారం వలంటీర్లు ఇంటికొచ్చి చెబుతున్నారు. బ్యాంకుల్లో నేరుగా నగదు పడిందని చెప్పగానే వెళ్లి తెచ్చుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు.



పూర్ణా మార్కెట్ ఏరియాలో రేషన్ పంపిణీ

ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారు

ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్తుంది. ఇప్పుడు రూ.3 వేలు పెన్షన్ అందుకుంటున్నాను. గత ప్రభుత్వంలో వెయ్యి రూపాయల పింఛన్ కోసం జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అలాంటిదేమీ లేదు. ముఖ్యమంత్రిగా జగన్ బాబు వచ్చాక రోజులు మారాయి.

– పూసర్ల జానకీరామ్, వృద్ధాప్య పింఛన్‌దారుడు, 29వ వార్డు, దిబ్బలపాలెం

సమయానికే రేషన్

ప్రతి నెలా ఇంటి దగ్గరకే రేషన్ సరకులు వస్తున్నాయి. గతంలో ఎప్పుడు రేషన్ ఇస్తారోనని ఎదురు చూసేవారిమి. ఇప్పుడా పరిస్థితి లేదు. నెల మొదటి రోజు నుంచి ఐదో తేదీలోపే రేషన్ వ్యాన్ ఇంటికి సమీపంలోకే వస్తుంది. ఎక్కువ సేపు క్యూలైన్లలో కూడా వేచి ఉండాల్సిన పరిస్థితి కూడా లేదు. సీఎం వైఎస్ జగన్ పాలన బాగుంది.

– పోలమ్మ, మహారాణిపేట

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు వినతులను అందజేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 03, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ చెప్పారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాయంత్రం సచివాలయ సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జెడ్సీ కృష్ణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎన్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, వాటర్ వర్క్స్ ఈఈ సూరిశెట్టి శేఖర్, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో గంగమ్మకు ఘనంగా అభిషేకం



అభిషేకం నిర్వహిస్తున్న మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానకీరామ్ తదితరులు

మహారాణిపేట : ఫిషింగ్ హార్బర్‌లో ఏపీ మర పడవల సంఘం ఆధ్వర్యంలో శ్రీ జటా గంగేశ్వర రాజ్య శ్యామల అమ్మవారి యజ్ఞం దేదీప్యమానంగా జరిగింది. ఆదివారం మొదలైన ఈ యజ్ఞ ప్రక్రియ మంగళవారం వరకు కొనసాగుతుంది. సోమవారం ఏపీ మర పడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ఆధ్వర్యంలో బోటు యాజమానులు శాంతి హోమం, పరమశివునికి, గంగమ్మతల్లికి సహస్ర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గంగేశ్వరునికి సహస్ర కలశాభిషేకం జరుగుతుందని, ఈ అభిషేకంలో హార్బర్‌లో ఉన్న పరిశ్రమ ప్రముఖులు పాల్గొంటారని జానకీరామ్ తెలిపారు. మంగళవారం శ్రీ చక్ర మహా యజ్ఞం నిర్వహించి... అనంతరం ఊరేగింపుతో హార్బర్ వేలం కేంద్రం వద్ద గంగా హారతి గంగమ్మకు, రుద్ర రాజేశ్వరునికి, రాజ్య శ్యామలదేవికి సహస్ర కలశాభిషేకం తర్వాత మహాయజ్ఞం పూర్తవుతుందని తెలిపారు. మంగళవారం గంగమ్మతల్లికి శాంతి హోమం ముగింపు సందర్భంగా ఫిషింగ్ హార్బర్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగవని తెలియజేశారు.

రూ.30 లక్షలతో రోడ్లు, కాలువల నిర్మాణం



కొబ్బరితోటలో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు కొబ్బరితోటలో రూ.30 లక్షలతో నిర్మించిన సిమెంట్ కాలువలు, రోడ్లను కార్పొరేటర్ తోట పద్మావతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధిలో 33వ వార్డు దూసుకుపోతుందన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వార్డులో ఇప్పటికే యుపీహెచ్‌సీ నిర్మాణం పూర్తవడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న కల్యాణ మండపం త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. అనంతరం ఆమెతో వార్డు ప్రజలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతోపాటు సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, పిల్లి సత్తిబాబు వున్నారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు



బంగ్లా నుంచి కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. ఆమె తన క్యాంప్ ఆఫీస్ నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి కాలుష్య రహితమైన బ్యాటరీ కారులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించి విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

9 నుంచి రాష్ట్ర మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

సీతమ్మధార: ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ అఖిల భారత సభలు ఈ నెల 7 నుంచి విజయవాడలో, రాష్ట్ర మహాసభలు 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా సభ్యులు శ్రవంత్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు.

జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందుల ధరలు తగ్గించాలని, నకిలీ నాసిరకం మందులను అరికట్టడమే ఈ మహాసభల ప్రధాన ఉద్దేశమన్నారు. నల్లబజారుల మందుల అమ్మకాలు, ఆన్‌లైన్‌లో మెడిసన్ సెల్లింగ్ ఆపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ కంపెనీలను బలోపేతం చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ప్రజలందరి కోసం సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మహేష్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్ కళాశాలలో జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఆచార్య సత్యనారాయణరెడ్డి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో సోమవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ(సీఎస్‌టీటీ) న్యూఢిల్లీ, కళాశాల భాషా విభాగాల ఆధ్వర్యంలో ×భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం ప్రాముఖ్యత¥ అనే అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ముఖ్య అతిథులు ఆంధ్ర విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధ్యక్షుడు ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణరెడ్డి, సీఎస్‌టీటీ చైర్మన్ ఆచార్య గిరీష్ నాథ్ ఝా, ప్రోగ్రాం అధికారి సిహెచ్.వినోదినీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కళాశాల కార్యక్రమాలను, అధ్యాపకుల పనితీరు, యాజమాన్య ప్రోత్సాహాన్ని కొనియాడారు. ఇంటర్‌నెట్ ద్వారా సాంకేతిక పదజాల నిర్మాణంలో సీఎస్‌టీటీ వారి నవ్య శోధనలు, నూతన పోకడలను వివరించారు. సాంకేతిక పదజాల వినియోగంలో ప్రాంతీయ భాషల ప్రాధాన్యాన్ని గుర్తిస్తూ తెలుగు, హిందీ భాషల్లో సీఎస్‌టీటీ సంస్థ తమ కళాశాలలో సదస్సు నిర్వహించడం గర్వకారణమని కో–ఆర్డినేటర్ ద్వితీయ భాషా విభాగాధ్యక్షురాలు పి.కె.జయలక్ష్మి పేర్కొన్నారు. కార్యక్రమంలో సిస్టర్లు మేరీ, నేన్సీ జైన్ థామస్, డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి డాక్టర్ గౌరీనాయుడు, సిస్టర్ జైన్ థామస్, డాక్టర్ భాస్కరసుధ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ డాక్టర్ విధానం భేష్

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు డిఫెన్స్ అధికారుల కితాబు



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డిఫెన్స్ అధికారుల బృందం

ఆనందపురం : కుటుంబ డాక్టర్ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉందని డిఫెన్స్ అధికారులు కితాబు ఇచ్చారు. ఎన్‌డీసీ సీనియర్ డైరెక్టర్ ఎం.కె.ఏవీఎస్ ఆధ్వర్యంలో జాతీయ రక్షణశాఖ కళాశాల నుంచి 15 మంది డిఫెన్స్ అధికారులు మండలంలోని వేములవలసలో ఉన్న వైఎస్సార్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (ఆయుష్మాన్ భారత్)ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ డాక్టర్ విధానం వలన ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇంటికే పరిమితమైన దీర్ఘకాలిక రోగులకు తనిఖీలు, మందులు పంపిణీ, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షలు వరకు ఉచితంగా శస్త్ర చికిత్సలు, వైద్యసేవలు వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్టు పథకాలు అమలు తీరుని పరిశీలిస్తే అవగతమవుతోందని చెప్పారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌లోని సౌకర్యాలు, మందుల నిల్వలు, సంచార వైద్య వాహనాన్ని పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వైద్య సేవలు సంపూర్ణంగా అందించడానికి సిబ్బందితో పాటు మందులు కూడా అందుబాటులో ఉన్నాయని సిబ్బంది, డిఫెన్స్ అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఉమాపతి, కోరాడ రాజబాబు, వైద్యురాలు షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, డీపీఎంఓ జె.భీమేశ్వరరావు, సిహెచ్ఓ గంటా సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అధికారి అనంత్ పర్వార్ సస్పెన్షన్

ఉక్కునగరం: విభాగాధిపతిను దుర్భాషలాడిన స్టీల్‌ప్లాంట్ ఎల్అండ్‌డీసి మేనేజర్ అనంత్ పర్వార్‌ను ఉక్కు యాజమాన్యం సస్పెండ్ చేసింది. తక్కువ మార్కులు వేయడం వల్ల గ్రేడింగ్ తగ్గిందన్న కోపంతో పర్వార్ అదే విభాగం జీఎం ఎస్.భానును ఫోన్‌లో దుర్భాషలాడి ఆమెపై దాడికి ప్రయత్నించడంతో పాటు కులం పేరిట దూషించారు. ఈ మేరకు జీఎం భాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు పర్వార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పోలీస్ కమిషనర్ రవిశంకర్ సౌత్ ఏసీపీ టి.త్రినాథ్‌ను విచారణ అధికారిగా నియమించారు. అదే విధంగా పర్వార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై సత్వరం స్పందించాలంటూ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు యాజమాన్యం పర్వార్‌పై చర్యలు తీసుకుంది. పర్వార్ సస్పెన్షన్‌పై ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య హర్షం ప్రకటించారు.

ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకం

డాబాగార్డెన్స్: ప్రజాస్వామ్యం వర్ధిల్లాలంటే యువత ప్రముఖ పాత్ర పోషించాలని ఫోరం ఫర్ డెమెక్రసీ అండ్ డెవలప్‌మెంట్ చైర్మన్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ మాజీ ప్రొఫెసర్ పి.నరసింహారావు అన్నారు. రోల్ ఆఫ్ యూత్ ఇన్ ఎలక్ట్రాల్ రిఫార్మ్స్ అనే అంశంపై సోమవారం ఏవీఎన్ కళాశాల ఆవరణలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భాగస్వామ్యం ఎక్కువగా ఉన్నప్పుడే సామాజిక మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏయూ రిటైర్డ్ ప్రొఫెసర్ పూజారి హరిప్రకాష్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ఏ ప్రభుత్వమైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు ప్రొఫెసర్ కేసీ సూరి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలే పునాదని, ఆ విధానంలో మంచి మార్పులు వచ్చినప్పుడే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు మాట్లాడుతూ దేశంలో ఉండే ప్రతి ఒక్క ఓటరు తన ఓటు హక్కు వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యానికి పరిపూర్ణత లభిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల డీన్ శంకరనారాయణ, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని, ఎకనామిక్స్ హెచ్‌వోడీ ఏసయ్య, ఆనంద్, జి.సునీత, రామారావు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం



ఈవో శిరీషకు చెక్కు అందజేస్తున్న హరితరెడ్డి కుటుంబ సభ్యులు



విజయలక్ష్మి తరపున తిరుమలేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న భక్తుడు

డాబాగార్డెన్స్ : కనక మహాలక్ష్మి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు విరాళం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీషకు విశాఖ నగరానికి చెందిన ఎస్.హరితరెడ్డి (హెచ్ఐడబ్ల్యూఏజీఏ సంస్థలు) కుటుంబ సభ్యులు రూ.లక్షా 116 సోమవారం అందజేశారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావుకు బి.విజయలక్ష్మి తరపున భక్తుడు రూ.లక్షా 116 అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వీరిచే అమ్మవారికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు.

గంజాయి నిందితుల కోసం గాలింపు

సీతమ్మధార: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుల కోసం ఫోర్త్‌టౌన్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం అల్లూరి జిల్లా పాడేరు నుంచి కారు(ఏపీ39 ఎన్‌క్యూ 2485)లో ఇద్దరు వ్యక్తులు 140 కిలోల గంజాయిని తరలిస్తూ విశాఖ తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని కేంద్రీయ విద్యాలయం వెనుక గేటు వద్ద కారు పార్క్‌చేసి వెళ్లిపోయారు. కారును సీజ్ చేసిన పోలీసులు.. నిందితులిద్దరిని అనంతగిరికి చెందిన ఉమామహేశ్వరరావు, పూర్ణచంద్రరావు(కారు ఓనర్)గా గుర్తించారు. 2022 డిసెంబర్‌లో గంజాయి తరలిస్తున్న కేసులో ఏడుగురిని అరెస్ట్ చేశారు. అందులో అనంతగిరికి చెందిన పూర్ణచంద్రరావు ఉన్నట్లు గుర్తించారు. పాడేరులో గంజాయి పండించి, వారే కారులో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం ఇద్దరి వివరాల గురించి ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావుకు సమాచారమిచ్చారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూ ఆచార్యుడికి రెండు పేటెంట్‌లు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆచార్యుడు కె.ఈశ్వర్‌కుమార్‌కు రెండు భారతీయ పేటెంట్‌లు లభించాయి. తిరుపతి నుంచి విశాఖపట్నం మధ్యలో ఉన్న తూర్పు కనుమల్లోని ఔషధ మొక్కలపై చేసిన పరిశోధనకు ఈశ్వరకుమార్‌కు, పరిశోధకులకు ఈ పేటెంట్‌లు దక్కాయి. ఈ సందర్భంగా ఈశ్వర్‌కుమార్‌ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో అభినందిచారు. ఏయూ ఐపీఆర్ కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 125 పేటెంట్ దరఖాస్తులు చేశామని, ఇప్పటి వరకు 6 పేటెంట్‌లు సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, ఐపీఆర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్.పురుషోత్తం పాల్గొన్నారు.

'మణిపూర్‌లో అంతర్యుద్ధం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జోస్ మాలేకల్, పద్మ తదితరులు

డాబాగార్డెన్స్: మతోన్మాద బీజేపీ అనుసరిస్తున్న విధానాలే మణిపూర్‌లో అంతర్యుద్ధానికి కారణమని మహిళా చేతన ప్రధాన కార్యదర్శి కె.పద్మ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో 'మణిపూర్‌లో అంతర్యుద్ధం' పేరిట రూపొందించిన పుస్తకాన్ని హెచ్ఆర్ఎఫ్ నాయకుడు డాక్టర్ జోస్ మాలేకల్ ఆవిష్కరించారు. ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ సత్యపాల్ సమీక్షించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగిన విధ్వంసం గత ఏడాది ఆగస్టులో మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. వీటిపై దేశమంతా రగిలిపోతుండగా, పార్లమెంట్‌లో ఈ అంశంపై చర్చ జరగకుండా బీజేపీ ప్రభుత్వం మొండికేయడంతో ప్రతిపక్షాలు పార్లమెంట్‌ను స్తంభింపజేశాయన్నారు. ఇటీవల తాము మణిపూర్‌లో పర్యటించామని, అక్కడి పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, తమ అనుభవాలు, అవగాహనను పుస్తకం రూపంలో తీసుకొచ్చినట్టు చెప్పారు. మణిపూర్‌లో తెగల మధ్య అంతర్యుద్ధానికి అక్కడి బీజేపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. న్యాయవాది జహీరా, రమాసుందరి, వీవీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.